క్లుప్తంగా

కంటి సంరక్షణపై శ్రద్ధ చూపాలి


సౌజన్య

కొత్తపల్లి: కంటి సంరక్షణపై ప్రజలు శ్రద్ధ చూపాలని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పిల్లలకు కళ్ల కలకలు వస్తున్నారు. పాఠశాలల్లో రోజుకు 20 నుంచి 30 వరకు కళ్ల కలక కేసులు వస్తున్నాయని ఆమె తెలిపారు.

కళ్ల కలక లక్షణాలు

కంటి పొరకు బాక్టీరియా, వైరస్ సోకడం ద్వారా కళ్ల కలక వస్తుంది. వర్షకాలంలో నీటిలో బాక్టీరియా పెరిగినపుడు ఇది వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు ఇలా..

కళ్లకలక వచ్చినపుడు ఎట్టి పరిస్థితిల్లోనూ కంటిని నలపరాదు. గోరువెచ్చని నీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలి. కంటి వైద్య నిపుణులను సంప్రదించి మందులు వేసుకోవాలి. కళ్లకలక వచ్చిన వ్యక్తికి డ్రాప్స్ వేసిన తర్వాత చేతులను శుభ్రపరచుకోవాలి. అదే చేతులతో మన కళ్లను తాకినా వేరే వ్యక్తులకు ఈ వైరస్ సోకుతుంది. వైరస్ సోకిన వ్యక్తి కళ్లలోకి చూడడం ద్వారా వ్యాప్తి చెందదు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

పిఠాపురం: గొల్లప్రోలు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు ఎస్సీ కాలనీలో శుక్రవారం వారు పర్యటించారు. తాగునీటి సమస్యపై స్థానికులతో మాట్లాడారు. తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వారికి వివరించారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు


దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో అధికారులు

పిఠాపురం: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని సారా బట్టీలపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ సింగ్, ఎక్సైజ్ సీఐలు సునీల్ కుమార్, నాగవల్లీ తమ సిబ్బందితో పిఠాపురం మండలం కొత్త కొంపలలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 25 ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు ఇక్కడి నుంచే సారా సరఫరా చేస్తున్నట్టు గుర్తించిన అధికారులు ఆయా గ్రామాలపై నిఘా ఏర్పాటు చేశారు. పిఠాపురం ఎక్సైజ్ సీఐ నాగవల్లీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

108 వాహనంలో ప్రసవం


108 వాహనంలో జన్మించిన బిడ్డను చూపుతున్న సిబ్బంది

అన్నవరం: శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన ఓ మహిళ 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. నెల్లిపూడికి చెందిన గర్భిణి మాసా సునీతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అన్నవరంలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది వెంటనే నెల్లిపూడి వెళ్లి సునీత రౌతులపూడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మగ శిశువు జన్మించినట్టు అంబులెన్స్ ఈఎంటీ టి.విద్యాసాగర్, పైలెట్ కరుణ సాగర్ తెలిపారు.

వచ్చేనెల 21, 22 తేదీల్లో ఎన్జీవో కౌన్సిల్ సమావేశాలు

తుని రూరల్: విజయవాడలో ఆగస్టు 21, 22 తేదీల్లో జరిగే ఏపీఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని తుని తాలూకా అధ్యక్షుడు టీవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన ఏపీఎన్జీవో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. తుని యూనిట్ నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతిష్టాత్మకంగా జరిగే 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సంఘ సహా అధ్యక్షులు డి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల సమస్యకు మోక్షం

- తూటేరు డ్రైన్‌లో పూడిక తీత ప్రారంభం
- వాన నీటిలో నానుతున్న పంట భూములు
- నిధులు మంజూరైనా వర్షాలతో అంతరాయం
- ఎట్టకేలకు అధికారుల స్పందనతో రైతన్న హర్షం


వీకే రాయపురంలోని తూటేరు డ్రైనులో జేసీబీతో గుర్రపు డెక్క తొలగిస్తున్న రైతులు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: వీకే రాయపురంలోని తూటేరు డ్రైను పూడిక తీత పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఎనిమిదేళ్ల సమస్యకు పరిష్కారం లభిస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేసినా వర్షాలు తీవ్ర అంతరాయం కలిగించడంతో పనులు ప్రారంభించడానికి కుదరలేదు. అప్పటికే కురిసిన వర్షాలకు సుమారు 800 ఎకరాలు నీట మునిగాయి.

పనులు వేగవంతం

గుర్రపు డెక్క తొలగింపునకు రెండు జేసీబీలు పెట్టాలని నిర్ణయించినా వర్షాల వల్ల ఒకటే లభ్యమైంది. రెండు ఉంటే వారం రోజుల్లో పని పూర్తవుతుంది. దీంతో పూడిక తీత మరికొన్ని రోజులు కొనసాగుతుంది.

– వెలమర్తి శ్రీనివాసు, రైతు సంఘ కార్యదర్శి, వీకే రాయపురం



గట్లు ప్రమాదకరంగా ఉండడంతోనే జాప్యం

తూటేరు డ్రైనులో గుర్రపు డెక్క తీయడానికి గట్లు బురదమయంగా ఉండి ప్రమాదంగా ఉండటం వల్లే పనులకు జాప్యం జరిగింది. త్వరలో రెండో జేసీబీ ఏర్పాటు చేస్తాం. జేసీబీకి సహకరించడానికి రైతు సంఘం నుంచి నలుగురు కూలీలను ఏర్పాటు చేసి వారి ఖర్చు భరిస్తున్నారు.

– డి.శ్రీలలిత, ఎంపీడీఓ, సామర్లకోట



ఆలయాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

- చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు మంగతాయారు, సాయి ప్రసాద్
- పాలకవర్గాలతో ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకటేశ్వర ఆలయ పాలకవర్గం

పెద్దాపురం: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక తత్వం పెంచడతో పాటు ఆలయ అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గాలు పని చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చెర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. పట్టణంలోని విశ్వేశ్వర స్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల దేవస్థాన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఆయా ఆలయాలు మరింత అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులచే ఈఓ ప్రమాణ స్వీకారం చేయించారు. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి ఏపీఓ, ఏపీఎంలకు శిక్షణ


సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలోని ఏపీఎంలు, ఏపీఓలు, కొంత మంది ఎంపీడీఓలకు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ రెండో తేదీ వరకు ఏడు బ్యాచ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్టు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామ రాజు, తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదారి, ఏలూరు జిల్లాలోని 432కి శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ శిక్షణలో మునగ ఆకు ప్రాధాన్యాన్ని వివరించి వాటి పెంపకంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటి వినియోగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

చెత్త సమస్యను పట్టించుకోరా?

- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం


నగర పంచాయతీ కార్మికుడు శ్రీనివాస్ మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న సభ్యులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రోజురోజుకూ చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకోరా ? అని కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ వార్డు కౌన్సిలర్ మొగలి దొరబాబు మాట్లాడుతూ ప్రస్తుతం నగర పంచాయతీ పరిధిలో చెత్త పెరిగిపోయి వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది డెంగీతో కొందరు చనిపోయారని, ఈ ఏడాది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ స్పందిస్తూ వ్యర్థాల తొలగింపు వాహనం మరమ్మతులకు గురైందని, మరమ్మతులు పూర్తి చేయించి చెత్త పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. శానిటరీ సిబ్బంది కంటే సూపర్‌వైజింగ్ చేసే వారే అధికంగా ఉన్నారని, వారికి అవసరమైన పని కల్పించాలని మొగలి దొరబాబు అధికారులకు సూచించారు. అలా ఉంటే వారికి అదనపు పనులు కేటాయిస్తామని కమిషనర్ తెలిపారు. కో ఆప్షన్ సభ్యురాలు షమ మాట్లాడుతూ ముస్లిం శ్మశాన వాటిక పనులు ఎప్పుడు చేపడతారో తెలపాలన్నారు. శ్మశాన వాటిక నిధులు ముందు రూ.9 లక్షలు అని ఇప్పుడు రూ.7 లక్షలు అంటున్నారని, త్వరితగతిన పనులు చేపట్టాలని కోరారు. దీనిపై ఏఈ ప్రభాకర్ మాట్లాడుతూ ఆ పనులకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని సమాధానం ఇచ్చారు. నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరి సహకారం ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గంద్రేటి మంగతాయారు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. తొలుత ఇటీవల మృతి చెందిన నగర పంచాయతీ ట్రాక్టర్ కార్మికుడు పడాల శ్రీనివాస్ మృతికి సంతాపంగా కౌన్సిల్ సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు పూర్తి చేయాలి


జగనన్న కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక గజనన్న కాలనీలో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాగునీటి పైప్ లైన్లు, డ్రైన్లు, హౌసింగ్ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. వచ్చే నెలలో నియోజకవర్గానికి సీఎం జగన్ వచ్చే అవకాశం ఉందని దొరబాబు తెలిపారు. కాలనీలో నిర్మిస్తున్న ఆర్చి నిర్మాణాన్ని పరిశీలించారు. హౌసింగ్ డీఈ ఆర్ఎస్‌కే రాజు, మున్సిపల్ డీఈ హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, కౌన్సిలర్లు జట్ల మోహన్, ఆవాల లక్ష్మీనారాయణ, పాలిక చంటిబాబు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

జగనన్న సురక్షలో చైర్‌పర్సన్ అరుణ


సామర్లకోటలో సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్


రమణక్కపేటలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న నేతలు


ప్రజా సమస్యలు వింటున్న చైర్మన్, వైస్ చైర్మన్లు

సామర్లకోట: స్థానిక 15వ వార్డు సచివాలయ పరిధి గణపతినగరం వాటర్ ట్యాంకుల వద్ద శుక్రవారం జగనన్న సురక్ష నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందాలనే లక్ష్యంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారని, మరింత బాధ్యతతో పనిచేసి వారి మన్ననలు పొందాలని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ జాన్ మోజెస్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మరో వైస్ చైర్మన్ గోకిన సునేత్రా దేవి, కౌన్సిలర్లు రెడ్నం సునీత, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, పార్టీ నాయకులు, సచివాలయ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. శుక్రవారంతో జగనన్న సురక్ష కార్యక్రమాలు ముగిసినట్టు కమిషనర్ జె.రామారావు తెలిపారు.

లబ్ధిదారులకు వరం సురక్ష

కొత్తపల్లి: గ్రామాల్లోని లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమం ఓ వరమని సర్పంచులు కాజులూరి అమ్మజీ, శీలం పెద్ద అప్పారావు అన్నారు. మండలంలోని రమణక్కపేట, యండపల్లి గ్రామాల్లోని సచివాలయాల వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుంద్ర శ్రీధర్, సచివాలయ కన్వీనర్ గుంద్ర జగ్గారావు, ఎండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గుంద్ర రాజబాబు, జ్యోతుల చక్రబ్బాయి, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, ఈఓపీఆర్డీ భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

చరిత్రాత్మక నిర్ణయం

పెద్దాపురం: ప్రజావసరాలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా సీఎం జగన్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అన్నారు. 14వ సచివాలయం పరిధిలోని 25, 27వ వార్డుల్లో శుక్రవారం జగనన్న సురక్ష నిర్వహించి పలువురికి ధ్రువ పత్రాలు అందజేశారు. వార్డు కౌన్సిలర్ బొబ్బిలి వీర వెంకట దుర్గ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీపీఓ ఉమామహేశ్వరావు, మేనేజర్ జ్యోతిరాణి, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్ళి వీర్రాఘవులు, విడదాసరి రాజా, పప్పల దుర్గారావు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

వాక్కాయ... విరగ కాసిందయ్యా..


విరగ కాసిన వాక్కాయ చెట్టు


వాక్కాయలు

పిఠాపురం: నీటి ఆధారం అవసరం లేదు.. చీడపీడల బెడద అసలే ఉండదు.. పశువులు, పక్షులు తినేస్తాయనే భయపడాల్సిన పని లేదు.. ఆ చెట్లకు ఉన్న ముళ్లే వాటికి రక్షణ అవేనండి చెట్ల పొదలు కంచెల్లో కనిపించే వాక్కాయ చెట్లు. గ్రామీణ ప్రాంతాల్లోని పుంత రోడ్లలో వెళుతుంటే ఎక్కడ పడితే అక్కడ ఈ చెట్లు కనిపిస్తుంటాయి. ఒక్క కాయ నోట్లో వేసుకుని పని చేస్తుంటే వారికి ఇక అలసటనేదే ఉండదంటున్నారు రైతు కూలీలు. దీని శాస్త్రీయ నామం కరోండా. ఈ కాయలనే చెర్రీ ఫ్రూట్స్ తయారీకి ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో పొలాల గట్లపై కంచెల్లో వాటంతట అవే పెరుగుతుంటాయి. చెర్రీ ఫ్రూట్స్‌కు గిరాకీ ఉండడంతో వీటికి డిమాండ్ పెరిగింది. ప్రకాశం జిల్లాలో వాక్కాయ తోటలు పెంచుతున్నారంటే వీటికి గిరాకీ ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వాక్కాయల ధర పచ్చివే కేజీ రూ.50 వరకు పలుకుతుంది. వీటిని కూరల్లో సైతం ఉపయోగిస్తారు. సి విటమిన్ ఎక్కువగా ఉండే వీటిని పచ్చివి, పళ్లు తింటుంటారు. అత్యంత పుల్లగా ఉండే వీటిని పచ్చళ్ల తయారీకి ఉపయోస్తారు. గొల్లప్రోలు మండలం పుంత రోడ్లకు ఇరు వైపులా ఉన్న కంచెల్లో పలు వాక్కాయ చెట్లు ఉండడంతో ఆ దారిన వెళ్లేవారు వీటిని కోసుకుంటున్నారు.

చారుమజుందార్‌కు ఘన నివాళులు


ఏలేశ్వరంలో చారుమజుందార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో చారుమజుందార్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద చారు మంజుదార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన చారుమజుందార్‌ను పోలీసులు అన్యాయంగా అంతమొందించారన్నారు. పేదలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, నాగులాపల్లి అర్జునుడు, మాడెం బాబీ, కోన గంగాధర్, గుమ్మడి రాజు, తదితరులు పాల్గొన్నారు.

లంపకలోవలో..

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో నక్సల్‌బరీ ఉద్యమ నేత చారు మజుందార్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. తొలుత సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. చారు మజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నక్సల్ బరీ ఉద్యమంలో చారు మజుందార్ పోరాటాన్ని కొనియాడారు.

కాలుష్య జలాలను మళ్లించండి

అధికారులకు కమిషనర్ ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య జలాలను బిక్కవోలు డ్రైన్‌లో కలిసేలా మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య వ్యర్థాలు, జలాలను సామర్లకోట కెనాల్‌లో వదులుతున్నారన్నారు. మేడపాడు, వేట్లపాలెం, బలభద్రపురం, హుస్సేన్‌పురం పంచాయతీల నుంచి వచ్చే డ్రైనేజీ నీటితో పాటు కాలుష్య జలాలను ప్రత్యామ్నాయంగా మళ్లించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వేమగిరి నుంచి అనపర్తి వరకు పంచాయతీల నుంచి వచ్చే ఘన, ద్రవ వ్యర్థాలపై కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం

ఓటర్ల గుర్తింపు సర్వేపై కమిషనర్ మహేష్‌కుమార్ శుక్రవారం ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో సమీక్షించారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు సర్వేను సమగ్రంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, తహసీల్దార్ సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

పిఠాపురం: నియోజకవర్గంలో పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాలు, పిఠాపురం పట్టణ పరిధిలో పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపారు. పిఠాపురం మండలం విరవలో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి రూ.11,050 స్వాధీనం చేసుకున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో సాయిబాబా గుడి వద్ద పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసిన వారి నుంచి రూ.1570 స్వాధీనం చేసుకున్నారు. పిఠాపురం పట్టణ పరిధిలోని మార్కెట్ వద్ద పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.7050 స్వాధీనం చేసుకున్నారు. ఆయా పరిధుల్లోని ఎస్సైలు గుణశేఖర్, వినయ్ ప్రతాప్, జగన్మోహన్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ ప్రమోద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.